RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 376 | 14 గురువారం మే 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--


# రైతులకు గుడ్ న్యూస్..

**పంటల మద్దతు ధరను పెంచుతూ కేంద్రం నిర్ణయం**

**ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం**

**రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు**

**క్వింటాల్ వరికి రూ. 2,441గా మద్దతు ధర**



ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. పెట్టుబడి ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి కొత్త ధరలను ఖరారు చేశారు. వరి క్వింటాల్‌కు రూ. 2,441 గా నిర్ణయించారు. గ్రేడ్-ఏ వరి క్వింటాల్‌కు రూ. 2,461 గా మద్దతు ధరను ఖరారు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్ మద్దతు ధర కోసం కేంద్రం ఏకంగా రూ. 2.6 లక్షల కోట్లను కేటాయించడం విశేషం. వ్యవసాయంతో పాటు రవాణా, ఇంధన రంగాలకు కూడా కేంద్ర కేబినెట్ పెద్దపీట వేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇంధన భద్రత కోసం ఈ పథకానికి రూ. 37,500 కోట్లు కేటాయించారు. సర్కేజీ - ధోలేరా మధ్య సెమీ హై స్పీడ్ డబుల్ రైల్వే లైన్ నిర్మాణం కోసం రూ. 20,065 కోట్లు మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



# విచారణకు హాజరుకాలేకపోతున్నాను

## : పోలీసులకు బండి భగీరథ్ లేఖ

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్, తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను హాజరుకాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు రెండు రోజుల గడువు కావాలని పోలీసులకు లేఖ రాశాడు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులకు మెయిల్ పంపించాడు. మే 8వ తేదీన మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు నిన్న నోటీసులు జారీ చేశారు. అయితే, తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా ఆధారాలు, సమాచారం సేకరించేందుకు సమయం కావాలని భగీరథ్ పోలీసులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని ఆయన స్పష్టం చేశారు. విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని సూచించాలని కోరారు.

మరోవైపు, ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కఠినమైన పోక్సో సెక్షన్ 5(1), 6ను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చారు. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే 20 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో దర్యాప్తు వేగవంతమైంది.ఇదిలా ఉండగా, భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. తప్పుడు కేసు పెట్టి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని బాధితురాలి కుటుంబంపై భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

## బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా

# లుకౌట్ నోటీసులు జారీ చేయాలి

## : కవిత




విమర్శనాస్త్రాలు సంధించారు. పోక్సో కేసులో ఉన్న బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా పోలీసులు వెంటనే లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఒకవేళ నేరం రుజువైతే బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తండ్రిగా బండి సంజయ్ ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకోవడం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిందని ఆమె అభిప్రాయపడ్డారు. బాధితురాలి జీవితాన్ని దెబ్బతీసేలా వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని, ఆ అకౌంట్లను బ్లాక్ చేయాలని కోరారు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని కవిత అన్నారు. ఇప్పటివరకు ఆయన ఈ ప్రాజెక్టును ఒక్కసారి కూడా సందర్శించకపోవడం ఏమిటని ఆమె ఆక్షేపించారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం నీటి వనరుల వినియోగంలో విఫలమవుతోందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కులగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాడతామని కవిత తెలిపారు. నీట్ పేపర్ లీక్ గురించి ఆమె మాట్లాడుతూ... జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీక్ ఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికే తమ పార్టీ పుట్టిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్

## : మంత్రి పొంగులేటి



పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళ రెండో రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. రెండో విడతకు సంబంధించిన విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ కోసం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి తెలిపారు.

## అధికారం పోయినా ఉదయనిధికి

# జ్ఞానోదయం కలగలేదు

## : రఘునందన్ రావు



ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీలో ప్రసంగించిన డీఎంకే నేత, మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, తన పాత వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. మనుషుల మధ్య దూరాన్ని పెంచి, విభజన తెచ్చే సనాతన ధర్మాన్ని అంతం చేయాలన్న తన నినాదాన్ని ఆయన మళ్లీ లేవనెత్తారు. అయితే, ఇదే సమయంలో ఆయన రాజకీయ పరిణతిని కూడా ప్రదర్శించారు. కొత్త ముఖ్యమంత్రి విజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూనే, సభలో అధికార, ప్రతిపక్షాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ తమిళనాడు అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని, సభలో రాజకీయ మర్యాదలు కొనసాగాలని కోరారు.మరోవైపు సనాతన ధర్మాన్ని అంతం చేయాలన్న ఉదయనిధిపై తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. అధికారం కోల్పోయినా ఉదయనిధికి జ్ఞానోదయం కలగలేదు అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మంపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యల వల్లే ప్రజలు డీఎంకేని తిరస్కరించారని రఘునందన్ గుర్తుచేశారు. అందరి మంచిని కోరుకునే ధర్మమే సనాతన ధర్మమని చెప్పారు. సర్వజనుల శ్రేయస్సును కోరే సనాతన ధర్మాన్ని విమర్శించడం మానుకోవాలని, హిందూ సంప్రదాయాలను గౌరవించాలని ఆయన హితవు పలికారు. భవిష్యత్తులో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఉదయనిధికి సూచించారు. రఘునందన్ రావు ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఉదయనిధిపై విమర్శలు గుప్పించారు.

# ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో!

## : అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు



తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో స్పష్టమైన మెజారిటీతో విజయ్ ప్రభుత్వం నెగ్గింది. విశ్వాస పరీక్షకు ఓటింగ్ సందర్భంగా డీఎంకే సభ నుంచి వాకౌట్ చేసింది. విశ్వాస పరీక్ష సందర్భంగా ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వాన్ని ఉద్దేశించి, ఈ ప్రభుత్వం ఎంతకాలం మనుగడ సాగిస్తుందోనని రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంతకాలం మనుగడ సాగిస్తుందో తెలియని ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. తమిళనాడులో లౌకికవాద ప్రభుత్వమే ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో రాష్ట్రంలోని దాదాపు 65 శాతం మంది ఓటర్లు ముఖ్యమంత్రి విజయ్, టీవీకేను తిరస్కరించారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చారని, కనీసం ఇప్పుడైనా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే రీతిలో పనిచేయాలని సూచించారు. ఎందుకంటే మీకు ఓటు వేసిన ప్రజలే ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందోనని ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొత్త ప్రభుత్వానికి సూచించారు. విశ్వాస ఓటింగ్‌లో తమ పార్టీ పాల్గొనడం లేదని, డీఎంకే ఎమ్మెల్యేలం వాకౌట్ చేస్తున్నామని ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. డీఎంకేతో పాటు మిత్రపక్షమైన ఎంఎంకే కూడా విశ్వాస పరీక్షను వ్యతిరేకించింది. మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆ పార్టీ నాయకుడు జవహిరుల్లా ప్రస్తావించారు. డీఎంకే మరో మిత్రపక్షం ఎంజేకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించాయి. ఏఎంఎంకే పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ కూడా ప్రభుత్వానికి మద్దతు పలికారు. దీంతో ఆయనను ఏఎంఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

## హైదరాబాద్ ఎస్టేట్ మంచిర్యాల

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ (రిజిస్ట్రేషన్ నం. 332/2022) నూతన కమిటీని మంగళవారం పుర పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియం ఆవరణంలో విలేఖరులు సమావేశమై ఎన్నుకున్నారు. ఏకగ్రీవకంగా మూడోసారి రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మిట్టపల్లి సంతోష్ కుమార్ (విశాలాంధ్ర) ను ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శిగా వేల్పుల కిరణ్ కుమార్ (ప్రజా ప్రతిభ), కోశాధికారిగా కూరపాటి శ్రీనివాస్ (టుడే టీవీ), ఉపాధ్యక్షుడిగా బద్రి సంతోష్ (క్రైమ్ మిర్రర్), సహాయ కార్యదర్శిగా గంజి సతీష్ (అక్షిత)లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఎరుకల బుచ్చిబాబు ( సిటీన్యూస్ ), ఎర్రవల్లి శ్రీనివాస్ ( అక్షర విజేత ), పిల్లి రవికిరణ్ ( తెలంగాణ వాణి ), మారేపల్లి సాయి కుమార్ ( ఆర్టిఐ ఎక్స్ ప్రెస్ ), డొలకల సంతోష్ కుమార్ ( హైదరాబాద్ ఎస్టేట్ ), లు కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మిట్టపల్లి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏర్పాటు కావడం సంతోషకరమని తెలిపారు. అధ్యక్షునిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మొత్తం కార్యవర్గానికి, విలేఖరులకు ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యత కోసం ప్రతి వర్కింగ్ జర్నలిస్టు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అదేవిదంగా రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ ఏ ఇతర క్లబ్ లోనూ విలీనం కాలేదు. భవిష్యత్తులో కూడా మేము ఎవరితోనూ విలీనం కాబోము. మా క్లబ్ స్వతంత్రంగా పనిచేస్తుంది. మా క్లబ్ ప్రతిష్టకు భంగం కలిగించేలా, విలీనం గురించి తప్పుడు వార్తలు లేదా దుష్ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోము. ప్రెస్ క్లబ్ ల పేరిట విహారయాత్రలకు వెళ్తున్నామని, అందుకు సహకరించాలని పట్టణంలో తిరుగుతున్న వ్యక్తులకు మా రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ కు ఎటువంటి సంబంధం లేదు. అటువంటి వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని పట్టణ ప్రజలను, రాజకీయ నాయకులను అధికారులను కోరుతున్నాము.



# పదవ తరగతి ఫలితాలలో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులను సన్మానించిన రజక విద్యార్థి విభాగం ఇంచార్జి కోరపల్లి రాజేష్



హనుమకొండ మే13 (హైదరాబాద్ ఎస్టేట్) పదవ తరగతి ఫలితాలలో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులను సన్మానించిన రజక విద్యార్థి విభాగం ఇంచార్జి కోరపల్లి రాజేష్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాలలో 600 మార్కులకు 532 సాధించిన వేల్పుల లహరి, వేల్పుల వర్షత 526 మార్కులు వచ్చిన సందర్భంగా ఈరోజు వారిని సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది

ములుగు జిల్లా గణపురం మండలం నారాయణగిరి పల్లె గ్రామానికి చెందిన వేల్పుల సాంబయ్య కూతురు వర్షత అరుణ్ కూతరు లహరి పదో తరగతి పరీక్షలు సాధించినందుకు అభినందనలు తెలియజేసిన కొరపల్లి రాజేష్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇంత మంచి ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థినీలకు అభినందనలు తెలియజేసిన కొరపల్లి రాజేష్

# ఆధ్యాత్మిక అభివృద్ధే సమాజానికి అసలైన బలం, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 13 :- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 11వ వార్డులో శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. వేద మంత్రాల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం మాట్లాడిన మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి. దేవాలయాలు కేవలం పూజలు చేసే స్థలాలు మాత్రమే కావుడ సమాజానికి సంస్కారం, శాంతి, ఐక్యతను అందించే పవిత్ర కేంద్రాలు. ఆంజనేయస్వామి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలి. యువత మంచి మార్గంలో నడవాలి. భక్తి ఉంటే మనసుకు ధైర్యం, జీవితానికి దిశ లభిస్తాయి" అని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతం ఆధ్యాత్మికంగా, అభివృద్ధి పరంగా ముందుండేలా ప్రతి కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆలయ పునర్నిర్మాణం పూర్తయిన తరువాత ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆధ్యాత్మిక కాంతి తీసుకురానుందని అన్నారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూడ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమం చివర్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో అనంత్ బాబు బెయిల్ రద్దు నిర్ణయం స్వాగతార్హం

## డాక్టర్ పిట్ట వరప్రసాద్ రాష్ట్ర అధ్యక్షులు,

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ
కాకినాడ, మే 13, 2026:
డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడు అనంత్ బాబుకు మంజూరైన రెగ్యులర్ బెయిల్‌ను రాజమండ్రి జిల్లా స్పెషల్ కోర్టు రద్దు చేయడం న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసాన్ని పెంచే పరిణామమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్టా వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు సాక్షులను విచారించేందుకు కోర్టు ప్రత్యేక షెడ్యూల్ విడుదల చేయడం కేసు విచారణ వేగవంతం అవుతున్న సంకేతమని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే దిశగా ఇది కీలకమైన ముందడుగు అని అన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ
"దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిజాలు వెలుగులోకి రావాలంటే విచారణ నిర్భయంగా, పారదర్శకంగా జరగాలి. సాక్షులపై ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా కోర్టు పర్యవేక్షణలో విచారణ కొనసాగడం అత్యంత అవసరం. బెయిల్ రద్దు చేయడం ద్వారా న్యాయస్థానం కేసు తీవ్రతను గుర్తించినట్లు స్పష్టమవుతోంది" అని అన్నారు.
కేసులో ప్రతి సాక్షిని సమగ్రంగా విచారించి, దోషులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించి, న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలు మరియు ఉద్యమ శక్తులు అప్రమత్తంగా ఉంటాయని తెలిపారు.



# విద్యా విప్లవానికి ఇబ్రహీంపట్నం కేంద్రబిందువు

## : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

### ప్రభుత్వ విద్యాసంస్థలకు ఆధునిక హంగులు... విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ ఏస్టేట్ ప్రతినిధి ప్రతినిధి మే 13:- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో విద్యా రంగాన్ని కొత్త దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా పట్టణ స్థాయి విద్య అందేలా ఆధునిక సదుపాయాలతో ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రంలో రూ.3.35 కోట్ల నిధులతో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఆనందం వ్యక్తం చేశారు. గతంలో జూనియర్, డిగ్రీ తరగతులు ఒకే భవనంలో కొనసాగడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొన్నారని, కొత్త భవనం అందుబాటులోకి రావడంతో చదువుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు. కొత్తగా నిర్మించిన క్లాస్‌రూములు, సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ఇతర మౌలిక వసతులను ఎమ్మెల్యే పరిశీలించి విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందాలనే ఉద్దేశంతో యంగ్ ఇండియా స్కూల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం తీసుకొస్తోందని ఎమ్మెల్యే వెల్లడించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విద్యాసంస్థలు అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. విద్యాభివృద్ధిపై ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం. ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో నిర్వహించిన విద్యా అవగాహన సమావేశంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో ప్రభుత్వ విద్యా విధానాలు, పాఠశాలల అభివృద్ధి, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ విద్యా విధానాలు, ఉపాధ్యాయుల బోధనలో ఆధునిక మార్పులు తీసుకురావాల్సిన అవసరాన్ని విద్యా నిపుణులు వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సమాజం మొత్తం బాధ్యతగా పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.




# ఇబ్రహీంపట్నం ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 13 :-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నిర్వహించిన పలు వివాహ శుభాకార్యాలలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివిధ గ్రామాలలో జరిగిన పెళ్లి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వధూవరులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజల ఇళ్లలో జరిగే శుభకార్యాలకు హాజరవుతూ ఆప్యాయంగా పలకరించడం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేకత అని స్థానికులు పేర్కొన్నారు. ప్రజలతో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, కుటుంబ సభ్యుడిలా ప్రతి శుభకార్యంలో పాల్గొనడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వివాహ వేడుకల సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల ఆనందాలలో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

# ఆధ్యాత్మిక వైభవంతో మంగళపల్లి అమ్మవారి ఆలయం మార్మోగింది

## కామరేశ్వరాలయ మహోత్సవంలో పాల్గొన్న కౌన్సిలర్ జెర్కోని మమత రాజు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 13 :-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ఆదిభట్ల మున్సిపాలిటీ మంగళపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ కామరేశ్వర లింగం మరియు ధ్వజస్తంభ పునః ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ జెర్కోని మమత రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేశారు. ఆలయ పునః ప్రతిష్టాపన ద్వారా గ్రామానికి మరింత ఆధ్యాత్మిక శోభ చేకూరుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జెర్కోని మమత రాజు మాట్లాడుతూ, దేవాలయాలు కేవలం పూజలకే పరిమితం కాకుండా సమాజంలో ఐక్యత, సాంప్రదాయ పరిరక్షణకు కేంద్రబిందువులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భక్తి భావనతో నిర్వహించిన ఈ మహోత్సవం అందరిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపిందన్నారు.



అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కౌన్సిలర్ మమత రాజును ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు మరియు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్ సౌడా పు మమత వెంకటేష్ గౌడ్ పేదింటి ఆడపడుచుకు బిడ్డకి పెండ్లి కానుక

(హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 13 )
ఇచ్చిన మాట ప్రకారం కందుకూరు చౌరస్తాలో పేదింటి ఆడపడుచు బిడ్డ కి పెండ్లి కానుక గా ఉప సర్పంచ్ సౌడపు మమత వెంకటేష్ గౌడ్ గారు 10116 రూపాయలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షులు సరికొండ జగన్ బంటారం శ్రీనివాస్ గౌడ్ రాజశేఖర్ రెడ్డి ఫయ్యు గణేష్ రెడ్డి తదితరులు పాల్గొనారు



RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం కార్యనిర్వహణాధికారి కి ఘన సన్మానం



కాచిగూడ, మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం కార్యనిర్వహణాధికారి గా ఎం. సత్య చంద్రారెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ కార్యవర్గ సభ్యులు మంగళవారం సాయంత్రం మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ఆవరణలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎం. సత్య చంద్రారెడ్డి ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయనకు మహాసభ కార్యవర్గం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్నూరుకాపు విద్యార్థుల సంక్షేమం కోసం మరింత సేవాభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు గంగం రవి, కొండూరు వినోద్ కుమార్, మణికొండ రమేశ్, బందెల జితేందర్, ఆవుల సతీష్, సెక్రటరీ కొంతం సురేష్ బాబు, గడ్డి చంద్రశేఖర్, ఐలి శ్రీనివాస్, గడేకర్ల సత్యనారాయణ తదితర మహాసభ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కందుకూరు మండల కేంద్రాల్లో స్మార్ట్ ఫైవ్ ఫిట్నెస్ జిమ్ ప్రారంభోత్సవం



(హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 13 ) ఈరోజు కొత్తగూడ ఎక్స్ రోడ్ వద్ద నూతనంగా స్మార్ట్ 5 ఫిట్అవంం స్త్రఎఎ ప్రారంభోత్సవం చేయడం జరిగింది. కందుకూరు మండల ప్రజలందరికీ అందుబాటులో ఉంటుంది జిమ్ ట్రైనర్ కూడా అందుబాటులో కలదు జిమ్లో మహిళలు మరియు పురుషులు ఇద్దరు చేసుకునే విధంగా సదుపాయాలన్నాయి కడియో కూడా సదుపాయం కలదు. జిమ్ యజమానులు దొడ్డ కీర్తి కుమార్ రెడ్డి, కుమ్మరి నరేష్, చిన్నారెడ్డి పాండు, జైపాల్ రెడ్డి, ఈ కార్యక్రమానికి మహేశ్వరం మాజీ మంత్రివర్యులు ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీ సబితా ఇంద్ర రెడ్డి గారుబీఆర్ఎస్ మండల్ అధ్యక్షుడు మన్నె జయేందర్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్,సీనియర్ నాయకులు కాకి దశరథ,కాసుల రామకృష్ణ రెడ్డి,యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్,సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి,మాజీ డైరెక్టర్లు సామ ప్రకాష్ రెడ్డి ,దేవీలాల్ నాయక్,డైరెక్టర్లు పొట్టి ఆనంద్,సర్పంచ్ కృష్ణ,సురసాని శేఖర్ రెడ్డి,మహిళా అధ్యక్షురాలు ఇందిరా దేవేందర్,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ,మాజీ ఎంపీటీసీ సురేష్ ,మహమ్మద్ ఆలి,సామ మహేందర్ రెడ్డి,అఖిల్ కుమార్,నరేందర్,రాజు,ముఖిం తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో ఉబెర్ భారీ విస్తరణ..

## సీఎం రేవంత్‌తో సీఈవో భేటీలో కీలక చర్చలు



ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబెర్ తెలంగాణలో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో కంపెనీ విస్తరణ, నగరాల్లో పార్కింగ్ సమస్యలు, రాబోయే భారత్ ఫ్యూచర్ సిటీలో అవకాశాలపై కీలక చర్చలు జరిపారు. హైదరాబాద్‌లో తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను విస్తరిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎంకు దారా ఖోస్రోషాహి తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన మొట్టమొదటి సీఓఈ ఇదేనని, ప్రస్తుతం ఇక్కడ 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని, భవిష్యత్తులో దీనిని మరింతగా పెంచనున్నామని వివరించారు. ఈ సందర్భంగా నగరాల్లో, ముఖ్యంగా మెట్రో స్టేషన్ల వద్ద ఎదురవుతున్న పార్కింగ్ ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఈవీ ఛార్జింగ్ స్టేషన్లతో కూడిన మల్టీ-లెవల్ పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉబెర్‌కు సూచించారు. పట్టణ రద్దీని తగ్గించేందుకు పార్కింగ్ నిర్వహణ రంగంలోకి ప్రవేశించే అవకాశాలపై అధ్యయనం చేయాలని కోరారు. సీఎం ప్రతిపాదనపై ఉబెర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 30,000 ఎకరాల భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు గురించి సీఎం వారికి వివరించారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపిన దారా ఖోస్రోషాహి, అక్కడ తమ కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమ భవిష్యత్ విస్తరణకు ప్రభుత్వ సహకారం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, సీటీఓ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారం రోజుల భారత పర్యటనలో భాగంగా ఖోస్రోషాహి పలువురు కేంద్ర, రాష్ట్ర నాయకులతో మొబిలిటీ, టెక్నాలజీ, పెట్టుబడులపై చర్చిస్తున్నారు. కాగా, పార్కింగ్ ప్రాజెక్టులు, కొత్త కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితులను ప్రకటించనప్పటికీ, తెలంగాణలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

# జనగణన విజయవంతానికి ప్రజల సహకారం అవసరం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 13 :-
రంగారెడ్డి జిల్లా, భారత ప్రభుత్వం చేపడుతున్న జనగణన2027 కార్యక్రమంలో భాగంగా ప్రారంభమైన తొలి దశ ఇంటి జాబితా మరియు ఇంటి గణన ప్రక్రియలో ప్రజలు, అధికారులు బాధ్యతాయుతంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

జనగణన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం రెండు దశల్లో నిర్వహిస్తోందని తెలిపారు. అందులో భాగంగా తొలి దశగా మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటి గణన కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ఈ సమయంలో ఇంటింటికి వచ్చే నమోదు అధికారులకు ప్రజలు పూర్తి స్థాయిలో సరైన సమాచారాన్ని అందించాలని సూచించారు. అందించే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

ఇంటి గణనలో భాగంగా మొత్తం 33 ప్రధాన ప్రశ్నలను నమోదు అధికారులు అడుగుతారని చెప్పారు. ఇంటి సంఖ్య, గోడలు, పైకప్పు నిర్మాణం, సొంత ఇల్లు లేదా అద్దె ఇల్లు, గదుల సంఖ్య వంటి గృహ వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. అలాగే కుటుంబ సభ్యుల సంఖ్య, కుటుంబ పెద్ద పేరు, లింగం, సామాజిక వర్గ వివరాలు కూడా సేకరిస్తారని పేర్కొన్నారు. త్రాగునీటి వనరు, మరుగుదొడ్డి, వంటగ్యాస్, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలపై వివరాలు తీసుకుంటారని చెప్పారు. అదేవిధంగా అంతర్జాలం, తెలివి ఫోన్, మడత కంప్యూటర్, దూరదర్శిని, ద్విచక్ర మరియు నాలుగు చక్రాల వాహనాల వంటి ఆస్తుల వివరాలు కూడా నమోదు చేస్తారని వెల్లడించారు. ప్రజలు స్వయంగా అంతర్జాలం ద్వారా తమ వివరాలను నమోదు చేసినప్పటికీ, ప్రభుత్వం నియమించిన గణన సిబ్బంది ఇంటికి వచ్చి వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. ఆ సమయంలో స్వీయ నమోదు గుర్తింపు సంఖ్యను చూపిస్తే సరిపోతుందని చెప్పారు. అనంతరం అధికారులు తమ పరికరాల్లో వివరాలను పరిశీలించి తుది ధృవీకరణ ఇస్తారని వివరించారు. గణన సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఇంటి గణనకు వచ్చే అధికారులకు సరైన సమాచారం అందించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

# హైదరాబాద్‌లో పార్కింగ్ సమస్య పరిష్కారంపై ఉబర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 13 :-
హైదరాబాద్ నగరంలో రోజురోజుకు తీవ్రమవుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉబర్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. అవసరమైతే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటులో ముందుకు రావాలని కోరారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి సంస్థ కార్యకలాపాలు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించింది.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఉన్న ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరింత విస్తరించనున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ప్రస్తుతం ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నారని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటు చేయాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ సమస్య తీవ్రరూపం దాల్చుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశముండటంతో ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు. ముఖ్యంగా మెట్రో స్టేషన్ల వద్ద తగిన పార్కింగ్ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో కూడిన మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఉబర్ దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి సూచనలపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం తెలిపింది. హైదరాబాద్ సమీపంలో నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ గురించి కూడా ముఖ్యమంత్రి ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో ప్రపంచ స్థాయి సదుపాయాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే అనేక సంస్థలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయని చెప్పారు. శంషాబాద్ విమానాశ్రయానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. గత డిసెంబర్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులపై ఆసక్తి చూపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయం నిర్మాణంపై దారా ఖోస్రోషాహి ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా & సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కమిటీలతో కాలయాపన చేస్తే తెలంగాణలో మరో ఉద్యమం తప్పదు

## తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



హైదరాబాద్, మే 13: కమిటీలతో కాలయాపన చేస్తే తెలంగాణలో మరో ఉద్యమం తప్పదని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి హెచ్చరించారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను మరిచి చారిత్రక తప్పిదం చేసిందని ఆరోపించారు. ఆ తప్పులను సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మూట కట్టుకోవద్దని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, రూ. 25వేల గౌరవ వేతనం ఇవ్వాలని, 100 ఎకరాల్లో అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ప్రభుత్వ పరంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఉద్యమ కారుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, 50 శాతం సబ్సిడీతో 1 కోటి రూపాయల రుణం వ్యాపార నిమిత్తం ఇవ్వాలని, రూ. 25 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని అన్నారు. కేకే కమిటీని స్వాగతిస్తూ అందులో ముఖ్య సంఘాలకు చోటు ఇవ్వాలని కోరారు. జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వరకు ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరించాలని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తే తెలంగాణలో మరో ఉద్యమం తప్పదని అన్నారు. జేఏసీ ప్రధానకార్యదర్శులు గాజుల యాదగిరి, మోత్కూరి మల్లేష్, టి. శోభారాణి, రాపాక శ్రీశైలం, రహిమున్నీసా బేగం, కర్నె లక్ష్మీ, చిలుక శారద, జి. విజయ లక్ష్మీ, డి. వెంకట లక్ష్మీ, రాజు గౌడ్, వి. అరుణ, కె. లలిత, కె. సత్య, షాజహాన్, గందమాల యాదగిరి, లాలా దేవ, రాజ్ మహమ్మద్, ఎ. స్వప్న, మల్లారం పద్మ, కూరాకుల శ్యామల, ఎస్. రాజయ్య, బి. గోదావరి, సి. దేవానంద్, పి. నర్సయ్య, ఎల్. వనజలక్ష్మీ, టి. మణేమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

## : సిపిఐ నేత ఆందోజు రవీంద్ర చారీ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 13 :-
హైదరాబాద్‌లో నమోదైన పోక్సో కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడంపై సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 17 ఏళ్ల బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి ఐదు రోజులు గడిచినా చర్యలు తీసుకోకపోవడం చట్టం అందరికీ సమానంగా అమలు కావడం లేదనే అనుమానాలను కలిగిస్తోందన్నారు. భగీరథ పరారీలో ఉన్నాడని పోలీసులు చెప్పడం, కేసు దర్యాప్తుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు బాలిక కుటుంబం డబ్బుల కోసం బెదిరించిందంటూ కరీంనగర్‌లో నమోదు చేసిన కేసు అసలు పోక్సో కేసు నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమేనని విమర్శించారు. బిజెపి నేతలు, ప్రజాప్రతినిధులపై మహిళలపై దాడులు, లైంగిక ఆరోపణలు పెరుగుతున్నాయని ఆరోపించిన రవీంద్ర చారీ, ప్రభుత్వం తక్షణమే భగీరథను అరెస్టు చేసి చట్టంపై ప్రజలకు నమ్మకం కల్పించాలని డిమాండ్ చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
14 గురువారం మే 2026

# ఆర్పీఐ (ఎ) తెలంగాణ రాష్ట్ర కమిటీలు రద్దు

## రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అ ) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్




హైదరాబాద్, మే 13: భారత రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ -ఎ) తెలంగాణ రాష్ట్ర కమిటీ, అనుబంధ సంఘాల కమిటీలను జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నామని జాతీయ కార్యదర్శి పేరం నాగేశ్వర్ రావు గౌడ్ తెలిపారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ పటిష్టత కోసం వచ్చే జూన్ మొదటి వారంలో సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో రాందాస్ అత్వాలే తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన నూతన కమిటీ ని ప్రకటిస్తారని తెలిపారు. వచ్చే జిహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీ, ఆర్పీఐ అన్ని డివిజన్లలో పోటీ చేసి అధికంగా డివిజన్లను సాధించుకుంటుందని చెప్పారు. మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకువస్తే పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్రానికి చెందిన 8 మంది లోక్ సభ సభ్యులు వ్యతిరేకించడాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోప్ తెగి కిందపడిన లిఫ్ట్...

## తెలంగాణ మంత్రికి తప్పిన ప్రమాదం



తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు పెను ప్రమాదం తప్పింది. ఆయన లిఫ్ట్‌లో ఉండగా రోప్ తెగిపోయింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆయనను బయటకు తీశారు. కరీంనగర్‌లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఉన్న ఒక రైతును పరామర్శించేందుకు ఆయన వెళ్ళిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. లిఫ్ట్ రోప్ తెగిన ఘటనలో మంత్రికి స్వల్ప గాయాలయ్యాయి. వైద్యులు ఆయనకు చికిత్స అందించారు. మంత్రి రైతును పరామర్శించేందుకు మొదటి అంతస్తు నుంచి కిందకు వచ్చేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ కిందకు వస్తుండగా సాంకేతిక లోపం కారణంగా రోప్ తెగి ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో లిఫ్ట్ ఫస్ట్ ఫ్లోర్ నుంచి కిందకు పడిపోయింది. దీంతో మంత్రి లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, పోలీసులు లిఫ్ట్ తలుపు తెరిచి మంత్రిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

# నా కుమారుడ్ని నేరస్తుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారు

## : బండి సంజయ్ ఆవేదన



తన కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తొలిసారిగా స్పందించారు. తన కుమారుడిని ఒక నేరస్తుడిగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో జరిగిన హిందూ ఏక్తా యాత్రలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

“ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం“ అని బండి సంజయ్ పేర్కొన్నారు. తన కుమారుడిపై జరుగుతున్న దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోందని, తన భార్య డిప్రెషన్‌లోకి వెళ్తోందని ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. రాజకీయ కారణాలతోనే తన కుటుంబాన్ని రోడ్డు మీదకు లాగుతున్నారని ఆరోపించారు. నేను భయపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారని, నేనెప్పుడూ భయపడనని అన్నారు. కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టనని బండి సంజయ్ హెచ్చరించారు. గత డిసెంబర్ 31న హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణను పర్యవేక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. మరోవైపు ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.

B.UPENDER
Sr. Marketing Director
Cell : 9392112739

# నీట్ పరీక్ష లీకేజీపై యువజన కాంగ్రెస్ ఆగ్రహ జ్వాలలు

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు ఆడొద్దు..

## కేంద్ర ప్రభుత్వంపై యూత్ కాంగ్రెస్ ధ్వజమెత్తింది



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 13 :- హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ మరియు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. దేశవ్యాప్తంగా వరుసగా పరీక్షల లీకేజీలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. గత కొన్ని సంవత్సరాలుగా పలు పరీక్షలు లీక్ కావడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల కష్టాన్ని, తల్లిదండ్రుల ఆశలను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని యువజన కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

